



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

శనివారం 22 నవంబర్ 2025 - పేజీలు 8


## వృథాగా తాగునీరు...

# ఆపేవారు లేరు..!




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** ఒకరోజు కాదు... ఒక వారం కాదు.. ఒక నెల కూడా కాదు... దాదాపు సంవత్సరం కాలం నుంచి గ్రామంలోని ఆ ప్రాంతంలో తాగునీరు వృథాగా పోతుంది. దీనికి కారణం కుళాయి నీరు విడుదల చేసే వాల్స్ మరమ్మత్తులకు గురికావడమే. ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనది అని అధికారులు నేతలు దంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం మనం వింటూనే ఉంటాం. ఇక్కడ వృథాగా పోతున్న నీరు.. చుక్కలు కాదు.. ఒక ధారలా. అధికారులు మాత్రం మమ్మల్ని అడిగేది ఎవరు అంటూ చోద్యం చూస్తున్నారు. గుంటూరు నగరానికి కూత వేటు దూరంలోని లాలుపురం గ్రామ దుస్థితి ఇది. పాపం... పంచాయితీకి నిధులు కొరత అనుకుంటున్నారా... అలా అయితే మీరు పప్పులో కాలేసినట్టే.

ఆదాయం పుష్కలంగా ఉంది. రెండు వాల్స్ మారిస్తే సుమారు రూ.25 వేలు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. లక్షల ఆదాయం ఉన్న పంచాయతీకి ఆ మొత్తం పెద్ద లెక్క ఏమీ కాదు. ప్రస్తుతం పంచాయతీకి గ్రామ సర్పంచ్ లేదు.

2 లో

## పత్తి కొనుగోలు సజావుగా జరిగేలా

# పకడ్బందీ చర్యలు

- నల్లరేగడి ప్రాంతంలో 18 శాతంకు పెంచి కొనుగోళ్ళు
- జిల్లాలో అదనంగా సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

2లో..

# అంగన్‌వాడీల బలోపేతానికి పనిచేయాలి

- తక్కువ బరువు ఉన్న చిన్నారులను ఎన్.ఆర్.సి ద్వారా పౌష్టిహాకారం అందించాలి
- పెనుమాక అంగన్ వాడీ కేంద్రాల్ని సందర్శించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్: అంగన్ వాడీ కేంద్రాలు, పూర్వ ప్రాథమిక పాఠశాలల పనితీరును మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. తాడేపల్లి మండలంలోని పెనుమాకలోని 3, 7 అంగన్ వాడి కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో 6 సంవత్సరాలలోపు ఉన్న తక్కువ

వివరాలు 2లో...



## న్యాయ దేవత విగ్రహాన్ని ఆవిష్కరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి

5లో..

## మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి

# పటిష్ట కార్యాచరణ

- ఆరు మత్స్యకారుల సహకార సంఘాలకు నూరు శాతం రాయితీతో రూ.10,11,978 మంజూరు
- కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** జిల్లాలో మత్స్య సంపదను వృద్ధి చేసి మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం తాడేపల్లి మండలం పడల రేవు వద్ద ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రకాశం బ్యారేజ్ జలాశయం లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా తో కలిసి చేప పిల్లలను ( స్టాకింగ్ ఆఫ్ ఫింగర్ లింగ్స్) విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2047 స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్లో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధన , మత్స్య రంగాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా విత్తనం నుంచి మార్కెటింగ్ వరకు, డిమాండ్ ఉన్న ఉత్పత్తులు వృద్ధి చేయడానికి మత్స్యకారులకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వ అందిస్తుందన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ప్రకాశం బ్యారేజ్ జలాశయంలో 23,50,000 చేప పిల్లలను విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇన్ ల్యాండ్ మత్స్యకారులు ఉన్నారని ప్రకాశం బ్యారేజీ జలాశయంతో పాటు నాలుగు మైనర్ ఇరిగేషన్ ట్యాంకులలో మత్స్య సంపదను వృద్ధి చేస్తున్నారన్నారు.

2 లో

# కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు



- నాదెండ్ల మనోహర్
- చింతా రాజుకు అభినందనలు వెల్లువ

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** జనసేన పార్టీలో కష్టపడి పని చేసే వాడికి తగిన గుర్తింపు ఉంటుందని జనసేనపార్టీ పిఏసి చైర్మన్, సివిల్ సప్లై శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ గుంటూరు శివారు బుడం పాడు గ్రామానికి చెందిన చింత రేణుక రాజు నియమితులైనారు. ఎన్నికైన అనంతరం తెనాలి పార్టీ కార్యాలయంలో జనసేనపార్టీ పిఏసి చైర్మన్ మరియు సివిల్ సప్లై శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ధన్య వాదాలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. రేణుకా రాజు కూడా పార్టీ బలోపేతానికి ఆవిర్భావం నుంచి అంకితభావంతో

2 లో

## ప్రజలకు మెరుగైన

# సేవలే లక్ష్యం

- మండల సమీక్షలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ మేజర్ న్యూస్:** నూజండ్ల విభాగాల పనితీరుపై విస్తృత సమీక్ష అధికారులకు క్లియర్ డైరెక్షన్స్ ఇచ్చిన జీవీ పెన్డింగ్ పనులు వెంటనే పూర్తి చేయాల ప్రజా సమస్యల పరిష్కారం ప్రాధాన్యం జీవీ ఆదేశాలు మండల స్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ వినుకొండ పట్టణంలో మున్సిపల్ ఆఫీసు నందు గురువారం జరిగిన మండల స్థాయి సమీక్షా సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవీ ఆంజనేయులు గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవల అందుబాటులోపులు, ప్రభుత్వ పథకాల అమలు పురోగతి వంటి ముఖ్య అంశాలపై ఆయన

వివరాలు 2లో...

# ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం





మొదటి పేజీ తరువాయి

విభాగాల వారీగా ప్రామాణిక సమీక్ష నిర్వహించారు. ప్రతి శాఖ అధికారి నుండి ప్రస్తుత పనుల స్థితి, పెండింగ్ ప్రాజెక్టులు, గ్రామస్థాయి అవసరాలు, ప్రజల ఫిర్యాదులపై స్పష్టమైన వివరాలు కోరారు. విద్య, వైద్య సేవలు, శుద్ధి నీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, రోడ్ల అభివృద్ధి, వ్యవసాయానికి సంబంధించిన సౌకర్యాలు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు అన్నింటిని ఒకొక్కటిగా సమీక్షించారు. సమావేశంలో అధికారులు అందించిన నివేదికలను పరిశీలించిన జీవీ , కొన్ని విభాగాలలో పనులు నిడివి ఎక్కువ కావడం, కొన్ని పథకాల అమలు వేగం తగ్గిపోవడం వంటి అంశాలపై అసంతృప్తి వ్యక్తం చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.

## కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు

మొదటి పేజీ తరువాయి

పనిచేసారు. రాబోయే రోజుల్లో సభ్యత్వం నమోదు జరుగుతుంది కాబట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మనోహర్ కోరారు. ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి రేణుకా రాజుకు పదవి రావడం కార్యకర్తలకు దక్కిన గౌరవం అని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పదవులు కష్టపడి పని చేసిన వారికి దక్కాలని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో ప్రారంభం కానున్న సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని జనసేనపార్టీ శ్రేణులు విజయవంతం చేసి జిల్లాలో అగ్రస్థానంలో ఉండేలా కృషి చేయాలని నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పదవి రావడం చాలా ఆనందంగా ఉందని నాపై నమ్మకంతో నాకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, పార్టీ పెద్దలకు ఆజన్మాంతం రుణపడి ఉంటాను అని రేణుకా రాజు అన్నారు. నాపై మీరు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జనసేన పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో 16వ డివిజన్ కార్పోరేటర్ దాసరి లక్ష్మి దుర్గ, వార్డు అధ్యక్షులు విష్ణుమొలకల ఆంజనేయులు, జనసేనపార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ



**మంగళగిరి, మేజర్ న్యూస్:** నగరంలోని 29వ వార్డు టిప్పర్లబజార్‌కు చెందిన యూసుఫ్ బేగ్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 25,000 వేల విలువైన చెక్కును టీడీపీ నాయకులు శుక్రవారం లబ్ధిదారునికి అందజేశారు. చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు లబ్ధిదారుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, గుంటూరు జిల్లా మైనార్టీ సెల్ సెక్రెటరీ షేక్ ఫిరోజ్ (ఖాదర్ వలీ), 29వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు బేతాళ కాంతారావు, షేక్ ఈసుబ్, తుమ్మల చెరువు రవి, చరణ్ పాల్గొన్నారు.

## వృధాగా తాగునీరు... ఆపేవారు లేరు..!

మొదటి పేజీ తరువాయి

గ్రామ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ ఇరువురు అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన రహదారిపై తాగునీరు పెద్ద మొత్తంలో మురుగుపాలు అవుతున్న వారికి కనిపించటం లేదా..! అంటూ గ్రామస్తులు కస్సు.. బుస్సు .. లాడుతున్నారు. పలుసార్లు ఈ విషయాన్ని గ్రామ ప్రజలు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం. అయినా వారు స్పందించకపోవడం వారి పనితీరుకు నిదర్శనమని... అలాంటి అధికారులు గ్రామానికి అవసరమా.. అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతి నీటి చుక్క ఎంతో విలువైనదని దంపుడు ఉపన్యాసాలు ఇచ్చే అధికారులు ఈ అంశంపై తక్షణ అదృష్టం సాధించాలని లాలుపురం ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యపై జోక్యం చేసుకుంటే సమస్య తక్షణమే పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వాల్స్ పై మూతలు లేకపోవటంతో మరొక ప్రమాదం పొంచి ఉంది. మలుపు ప్రాంతం కావడంతో కొందరు పాఠశాల విద్యార్థులు వాల్స్ గొయ్యి బారినపడినట్లు తెలిసింది. వాల్స్ మరమ్మత్తు తో పాటు వాటిపై మూతలను పటిష్టంగా ఏర్పాటు చేయాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.




## అంగన్‌వాడీల బలోపేతానికి పనిచేయాలి

మొదటి పేజీ తరువాయి

బరువున్న పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు చేపట్టాల్సిందిగా డాక్టర్ రాయపాటి శైలజ సిడిపిఓను ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది, పిల్లలు, పిల్లల తల్లులతో మాట్లాడారు. ఆయా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది పనితీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ చిన్నారులను ఎప్పటికప్పుడు బరువు, ఎత్తును పరిశీలించాలని, తక్కువ బరువు ఉన్న చిన్నారులను గుర్తించి ఎన్.ఆర్.సి. కేంద్రాలలో 15 రోజులు పాటు వుంచి మంచి పౌష్టిహాకారం అందించి వారి బరువు పెరిగే విధంగా చూడాలన్నారు. పిల్లలతో ముచ్చటించే క్రమంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అక్కడున్నవారందరితో మమేకమయ్యారు. చిన్నారులకు పౌష్టికాహారం, చిన్న చిన్న కథలపై పలు ప్రశ్నలు వేసి వారి సమాధానాలతో ముచ్చటపడ్డారు. పిల్లలకు సంబంధించిన రిజిస్టర్ నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. 0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఎంతమంది ఉన్నారు, వారు రోజు వస్తున్నారా అని వారి అటెండెన్స్ వివరాలను ఆమె తనిఖీ చేశారు. టాయిలెట్స్ ను ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలని, కేంద్రాల్లో ప్రీ గార్డెన్ అభివృద్ధి చేయాలని ఆమె అక్కడున్న సిబ్బందికి సూచనలిచ్చారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ వెంట కమిషన్ అడ్వైజర్ రావూరి సూయజ్, సెక్షన్ ఆఫీసర్ శైలజ, మంగళగిరి సీడీపీఓ సరిత, ఏసీడీపీఓ సౌమ్య, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి పటిష్ట కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి


జిల్లాలో ఉన్న 202 గ్రామాల మంచినీటి చెరువుల్లోను మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు. ప్రస్తుతం ప్రజల ఆహార విధానంలో మార్పు వచ్చిందని ప్రోటీన్లు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటున్నార న్నారు. ఫిషరీస్, ఆక్వా ఉత్పత్తులకు రానున్న రోజుల్లో మంచి డిమాండ్ ఉంటుందని, నాణ్యమైన మత్స్య సంపదను సాగు చేయాలన్నారు. మత్స్యకారులందరూ ఏపీ ఎస్ ఎడిఎలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపదన యోజన పథకం ద్వారా మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యం కోసం ఫిష్ వెండింగ్ యూనిట్లను అందిస్తుందన్నారు. వీటిపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు, నిర్దేశించిన లక్ష్యాల మేరకు గ్రౌండింగ్ చేసేలా జిల్లా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నా రన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకొని మత్స్యకారుల అభివృద్ధి చెందాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ్ జిల్లాలో ఆరు మత్స్యకారుల సహకార సంఘాలకు నూరు శాతం రాయితీతో మంజూరు చేసిన రూ.10,11,978 చెక్కును అందించారు. పలువురు మహిళ మత్స్యకారులు గుంటూరు వెన్ లాక్ మార్కెట్ లోని చేపల మార్కెట్లో కనీస సౌకర్యాలు లేక చేపల విక్రయించే దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కలెక్టర్ కు తెలియజేయగా పరిశీలించి సమస్యల పరిష్కర దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి కిరణ్, జిల్లా మత్స్యశాఖ సంఘం అధ్యక్షులు భూశంకర్, ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి, ఎంపీటీసీ శివకుమారి, ఎంపీపీ కృష్ణ, తహసిల్దారు సీతారామయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు

మొదటి పేజీ తరువాయి



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా సిసిఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు సజావుగా జరిగేలా పూర్తిస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం మేడికొండూరు మండలం డోకుపర్రు గ్రామంలోని శ్రీ విజయ వెంకటేశ్వర కాటన్ మిల్స్ లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తనిఖీ చేశారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు ప్రక్రియకు సంబంధించి తేమశాతం పరిశీలన, లాట్ జనరేషన్, సేల్స్ ఇన్వాయిస్ విధానం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల పనితీరు, పత్తి దిగుబడులు తదితర వివరాలను జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకువచ్చిన రైతులతో మర్యాదగా మాట్లాడి వారికి ఇబ్బందులు లేకుండా అవసరమైన సహాయ సహకారాలను మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, సిసిఐ బయ్యర్లు అందించాలన్నారు. కర్నూలు జిల్లాలో తరహా తేమ శాతం 12 శాతం కు మించి ఒక శాతం ఎక్కువ ఉన్న కొనుగోలు చేసేందుకు ఉన్న అవకాశాలను సీసీఐ బయ్యర్లు పరిశీలించాలన్నారు. పలువురు పత్తి రైతులు కలెక్టర్ తో మాట్లాడుతూ జిల్లా నల్లరేగడి ప్రాంతం కావడం వలన తేమ శాతాన్ని 12 నుంచి 18 శాతం కు పెంచాలని కోరారు. కపాస్ కిసాన్ యాప్ సర్వర్ స్లోగా ఉండటం వల్ల స్లాట్ బుకింగ్ లో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న తేదీ రోజు కొనుగోలు కేంద్రం వద్ద రద్దీ కారణంగా సరుకు అన్లోడ్ చేయలేకపోతే తదుపరి రోజు స్లాట్ బుకింగ్ ఇబ్బంది అవుతుందని దీనితో వాహనాల కిరాయి వెయిటింగ్ చార్జీ పెరిగిపోతుందన్నారు. స్లాట్ బుకింగ్ తేదీ నుంచి కనీసం 48 గంటలు వరకు అన్లోడింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం రైతుల నుంచి సీసీఐ కేంద్రాల ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలుకు వ్యవసాయ, మార్కెటింగ్, సిసిఐ అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు తీసుకున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉండేలా, పూర్తిస్థాయిలో గ్రేడింగ్ చేసిన పత్తిని తీసుకొని రావాలని గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులతో విస్తృతస్థాయిలో



అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతుల కోరినట్టు తేమ శాతాన్ని 18 శాతం కు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందని వీటిపై ఆదేశాలు రావాల్సి ఉందన్నారు. కపాస్ కిపాన్ యాప్ లో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని, స్లాట్ బుకింగ్ చేసుకున్న రోజు అనివార్య కారణాలవల్ల పత్తి అన్లోడింగ్ జరగకపోతే తదుపరి రోజు వరకు అన్లోడింగ్ కి అవకాశం కల్పించాలని సిసిఐ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగంకు తెలియజేస్తే వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం నాలుగు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయని, త్వరలోనే మరిన్ని కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడి సత్యనారాయణ చౌదరి, సెక్రటరీ శివశంకర్ రెడ్డి, సీసీఐ బయ్యర్ ఉమామహేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

**- 26న జరిగే కార్మిక కర్షక నిరసనను జయప్రదం చేయాలి**



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** వరిధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనగోలు చేయాలని, ఈ నెల 26న జరిగే కార్మిక,కర్షక నిరసనను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు కోరారు. శుక్రవారం బ్రాడిపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బొట్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వరికోత ప్రారంభమయ్యాయని, తుఫాను హెచ్చరికల నేపథ్యంలో తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకొంటున్నారన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.2389 ప్రకటించినా తేమ శాతం అధికంగా వుందని తిరస్కరించడం సరికాదన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి పంట ఋణాలు మంజూరు చేయాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింప చేసి 20వేలు పంట సహాయాన్ని ఇవ్వాలని కోరారు. ఇటీవల సంభవించిన తుఫానులో జిల్లాలో ప్రత్తి, మినుము పూర్తిగా దెబ్బతిన్నాయని, వారికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం నాయకులు పి.కృష్ణ, వై.నాగేశ్వరరావు, నల్లపు నిలాంబరం తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో
# నేడు విద్యుత్ కోత

**తెనాలి, మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్ల మరమత్తులు, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు తొలగింపు పనుల కారణంగా శనివారం పట్టణంలోని సుల్తానాబాద్, వడ్డెర కాలనీ, ఆలపాటి నగర్, సరళానగర్, సుందరయ్య కాలనీ, దుండిపాలెం రోడ్డు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో విద్యుత్ కొత ఉంటుందని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నేషనల్ ఇంట్రిగేషన్ క్యాంప్‌కు
# టి జె పి ఎస్ విద్యార్థి ఎంపిక




**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్:** స్థానిక టి జె పి ఎస్ కళాశాల లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె నరేష్ జాతీయ సేవా పథకం వాలంటీర్ నేషనల్ ఇంటిగ్రెషన్ క్యాంప్ కి ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు. డిసెంబర్ 9 వ తేది నుండి 18 వ తేది వరకు హిమాచల్ ప్రదేశ్ లో శిక్షణ ఉంటుందని చెప్పారు. వాలంటీర్ కె నరేష్ ని కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండంట్ కె వి బ్రహ్మం అభినందనలు తెలియచేశారు. చదువుతో పాటు జాతీయ సేవా పథకం వాలంటీర్ గా రానిస్తున్న నరేష్ తోటి విద్యార్థులకి ఆదర్శం గా నిలుస్తాడని, అంతే కాకుండా శిక్షణ లో ఉత్తంగా రాణించి కళాశాల, యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ కి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని చెప్పారు. జాతీయ సేవా పథకం గుంటూరు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జె వి సుధీర్ కుమార్, కళాశాల జాతీయ సేవాపథకం కార్యక్రమనిర్వహణ అధికారిని ఆర్ జయ శైలజ ఇతర అధ్యాపకులు నరేష్ కు అభినందనలు తెలియచేశారు.

# 24న విద్యార్థులకు, మహిళలకు రాజ్యాంగ అవగాహన సెమినార్

**- ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా - మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు**



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలకు విద్యార్థులు - మహిళలకు రాజ్యాంగ అవగాహన సెమినార్ జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో విద్యార్థులు మహిళలకు రాజ్యాంగ అవగాహన సెమినార్ ఆహ్వాన పత్రికలను ఇతర అతిథులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ సెమినార్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ - జాషువా - పూలే - పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ ఆధ్వర్యంలో బ్రాడీపేట రెండో లైన్ లోని సిపిఎం కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. ఈ సెమినార్ లో బాలల కోసం రాజ్యాంగ ప్రవేశిక పుస్తకం ఆవిష్కరణ జరుగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గల్లా మాధవి, మాజీ మంత్రి, రాజకీయ, సామాజిక విశ్లేషకులు డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ శాసన మండలి సభ్యులు, విద్యా రంగ రాజ్యాంగ నిపుణులు కె.ఎస్.లక్ష్మణరావు, విసికె పార్టీ ఏపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, రెవెన్యూ అసోసియేషన్ ఏపీ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు, డిప్యూటీ తహశీల్దార్ పి.ఏ.కిరణ్ కుమార్, సభా పరిచయం మాజీ ఏజీపీ సంకూరి రాజారావులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి,విణకె పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, ఆవాజ్ రాష్ట్ర నాయకులు ఛిష్టి భాషలు పాల్గొన్నారు.

# శరణాలయం సేవలు భేష్

**- మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ వేమూరి బాలకృష్ణ**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** షైన్ ఆనంద శరణాలయం సేవలు అభినందనీయమని మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ వేమూరి బాలకృష్ణ కొనియాడారు. డిసెంబర్ 14వ తేదీన జరుగనున్న చినకాకాని షైన్ ఆనంద శరణాలయం వార్షికోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని రాయల్ బ్యాంకెట్ లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్ అధ్యక్షతన వహించారు. అనంతరం ఎంవీఐ బాలకృష్ణ మాట్లాడుతూ శరణాలయం నిర్వాహకులు కొత్త భవనం నిర్మాణం చేసి గత ఏడు సంవత్సరాల నుంచి బాలబాలికలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ సేవలందించడం అభినందనీయమన్నారు. పుర ప్రముఖులు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ శరణాలయంలో ప్రతి ఏడాది వార్షికోత్సవం నిర్వహిస్తూ బాల బాలికలు స్వయంగా శిక్షణ పొంది ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల వలన వారిలోని కళారూపాలను బయటకు తీసుకురావడానికి ఒక వేదికగా ఉంటుందన్నారు. సమాజంలో మనిషి తాను అభివృద్ధి చెందటంతో పాటు సమాజానికి కూడా తోడ్పాటు ఇవ్వాలన్నారు. తమ ఇళ్లల్లో జరిగే శుభకార్యాల సందర్భంలో శరణాలయం బాల బాలికలకు సహాయం అందించే విధంగా మానవతా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. చదువుకునే బాలబాలికలకు సహాయ సహకారాలు అందిస్తే భవిష్యత్తులో వారు సమాజానికి తోడ్పాటు అందిస్తారన్నారు. పెదవడ్లపూడి మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 11 సంవత్సరాలు అద్దె భవనంలో ఉండి పిల్లలకు సేవలు అందించి, గత ఏడు సంవత్సరాలు నుంచి సొంత భవనంలోకి వచ్చి బాల బాలికలకు అన్ని తానై సేవలందిస్తున్న శరణాలయం నిర్వాహకులు నాయక్ దంపతుల కృషి, పట్టుదల పలు ధార్మిక సంస్థలకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, వివిధ రంగాల ప్రముఖులు అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, గాజుల శ్రీనివాసరావు, తుల్లిమిల్లి రామకృష్ణ, కొలిశెట్టి రాము, వీవీ ప్రసాద్, మేకల మోహనరావు, గోవాడ రవి, అందే మురళీ మోహనరావు, మాజేటి గోపాలకృష్ణ, పందేటి సాంబశివరావు, బైరబోయిన శ్రీనివాసరావు, శరణాలయం నిర్వాహకురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## 27, 28 తేదీల్లో వర్ష సూచన...
# పంటలు జాగ్రత్త

**- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా**

**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** వర్ష సూచన ఈ నెల 27, 28 తేదీల్లో ఉందని, రైతులు పంటల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు వర్షాలు కురుస్తాయని, పంటలు సురక్షితంగా ఉండుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా నూర్పిడి జరిగిన పంటలు, కోతలు కోసిన పంటలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు సహకరించాలని, తగు సూచనలు సలహాలు ఇవ్వాలని, పంటలు వర్షానికి గురి కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

**- సీఐటీయూ తాడేపల్లి మండల కన్వీనర్ పల్లె కృష్ణ**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే సిఐటియు గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని తాడేపల్లి మండల కన్వీనర్ పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామ సచివాలయ పారిశుద్ధ్య కార్మికులతో, ప్రజా సంఘాల నాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పోరాటం ద్వారానే ఏదైనా కార్మికులు సాధించు కో గలుగుతా రని అన్నారు. పాలక పక్ష ప్రభుత్వాలు కార్మికులను సంఘటితం కాకుండా విచ్ఛిన్నం చేసేందుకే కుట్రలు పన్నుతారని అన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ, యజమానులకు అనుకూలంగా చట్టాలు చేస్తున్నారని కృష్ణ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి వేసిందని అన్నారు. ఈ లేబర్ కోడ్ లు వలన కార్మికులు తమ హక్కులను కోల్పోవడమే కాక, పని గంటల భారం అదనమవుతుందని అన్నారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని తుంగలో తొక్కుతూ రాష్ట్ర ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చే విధంగా జీవో చేయడం దుర్మార్గమని, సిఐటియు దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తుంది అన్నారు. తాడేపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఆటోరంగ కార్మికులు, అంగన్వాడి, ఆశ, తదితర రంగాల కార్మికుల సమస్యల పైన సిఐటియు అండగా నిలబడి పోరాటం చేస్తుందన్నారు. ఈనెల 23, 24 తేదీలలో తాడేపల్లి పట్టణంలో జరుగు సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేయడం ద్వారానే తమ హక్కులను సాధించుకోగలుగుతారని అన్నారు. మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంపుదల చేయాలని, కనీస వేతన చట్ట ప్రకారం 26వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు నిరంతర పోరాటం చేస్తుందన్నారు. కార్మికులకు పని ప్రదేశాలలో భద్రత కల్పించాలని , ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని సిఐటియు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు. సిఐటియు జిల్లా మహాసభలకు అన్ని రంగాల కార్మికులు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, బత్తుల సంసోన్ పారిశుద్ధ్య కార్మికులు మిక్కెల్, సామ్రాజ్యం, డేవిడ్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# పట్టణంలో ప్రతి వార్డు అభివృద్ధి

**– 210 కోట్లతో శాశ్వత త్రాగునీటి పథకం చేపడతాం – కౌన్సిలర్ లింగమూర్తి ని అభినందించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి**





**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ పట్టణంలోని ప్రతి వార్డును అభివృద్ధి చేస్తూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించే దిశగా పయనిస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 32 వ వార్డులో నూతనంగా చేపట్టిన సిసి రోడ్డు ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో మున్సిపాలిటీలు ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వార్డుల్లో సమస్యలు తెలుసుకొని పరిష్కార దిశగా పనిచేసే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పట్నంలోని ప్రతి వార్డులో ప్రజా సమస్యలను తెలుసుకుని మౌలిక వసతులు కల్పించడంతోపాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి ఆధ్వర్యంలో 31,32 వాటిలో అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావటం, నిధులు కేటాయించిన వెంటనే లింగమూర్తి చొరవతో సిసి రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి పైప్లైన్ నిర్మాణం పనులు పూర్తిచేయడం అభినందనీయమన్నారు. వార్డుల్లో పనులు కేటాయించగానే కౌన్సిలర్ లింగమూర్తి లాగా ముందుకు వచ్చి పనులు చేపట్టే ప్రజలకు వసతులు కల్పించే దిశగా వార్డుల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని కోరారు. పట్టణంలో శాశ్వత త్రాగునీటి పథకం చేపట్టడమే తన ఆశయమని,210 కోట్లతో పనులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో తాము త్రాగునీటి పథకానికి నిధులు తెస్తే గత పాలకులు సమస్యను పరిష్కరించలేని అసమర్థులన్నారు. రెండేళ్లలో శాశ్వత త్రాగునీటి పథకంతో పాటు, తాము మున్సిపాలిటీకి అప్పగించిన 22 ఎకరాల ఎన్ఎస్పి స్థలంలో అభివృద్ధి చేపట్టి చూపుతామని తెలిపారు. పట్టణంలోని 32 వార్డుల్లో రహదారులు, డ్రైనేజీలు, పైపులైన్లు రైతుల మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో మున్సిపాలిటీలు అభివృద్ధి దిశగా ముందుకు వెళుతున్నాయని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కూటమి పాలనపై ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాగర్లమూడి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

**- గ్రామంలో మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ సుడిగాలి పర్యటన - పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చిన స్థానికులు**




**తెనాలి, మేజర్ న్యూస్ :** రూరల్ మండలం సంఘం జాగర్లమూడి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా శానిటేషన్ డ్రైవ్ లో రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు వినియోగదారుల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ పంచాయతీ రెవెన్యూ వ్యవసాయ విద్యాశాఖ, వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. గ్రామంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. గ్రామంలోని అన్ని వీధులు తిరుగుతూ ప్రజలను పలకరించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ నిర్వహణ, అభివృద్ధి పనులు, మంచినీటి సరఫరా, మౌలిక వస్తువుల కల్పన వంటి వివిధ అంశాలకు సంబంధించి ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా వీధిలైట్లు, నీటి సరఫరా, పెన్షన్లు పంపిణీ వంటి వివిధ సమస్యలను స్థానికులు మంత్రి దృష్టి తీసుకువచ్చారు. గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలు గుర్తించి వాటి పరిష్కారాన్ని కృషి చేయాలని ఆయన ఆదేశించారు. గ్రామంలో జరుగుతున్న కాలువ పూడికతీత పనులను పరిశీలించి అధికారులకు పలు సూచన చేశారు. గ్రామంలోని ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఆయన రోజువారి ఓపి, రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని పశు వైద్యశాలను ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఎంఈఓ లక్ష్మీనారాయణకు సూచించారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణకు పటిష్టమైన ప్రణాళికను ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ జాగర్లమూడి గ్రామాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి మెగా శానిటేషన్ డ్రైవ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రణాళిక బద్ధంగా గ్రామంలో సిమెంట్ రోడ్లు మంచినీటి సరఫరా తో పాటు, మరిన్ని మౌలిక వసతులు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో కొలకలూరు గ్రామంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ ద్వారా సమస్యలు గుర్తించి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలతో నూతన సాంకేతిక విధానములో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. సంగజాగర్లముడి గ్రామం ఎంతో చరిత్ర కలిగిన గ్రామం అని ,పూర్వకాలంలోనే గ్రామస్తులు స్వతహాగా వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. గ్రామంలో మహిళలకు త్వరలో పూర్తి శిక్షణ ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని వైద్యశాలలో స్థానికుల సహకారంతో వీల్ చైర్, ర్యాంప్, మరుగుదొడ్ల వంటివి త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీపై సస్పెన్షన్ వేటు

**తెనాలి, మేజర్ న్యూస్ :** సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ సామ్యూల్ డైమండ్ బాబును సస్పెండ్ చేస్తూ మున్సిపల్ కమీషనర్ జాగారపు రామ అప్పలనాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని 19 వ వార్డులోని 23 వ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీగా డైమండ్ బాబు పని చేస్తున్నారు. గత సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో సచివాలయం తాళాలు తెరచి ఓ మహిళను లోపలకు తీసుకువెళ్లారు. స్థానికులు గమనించి కేకలు వేయడంతో మహిళతో సహా పరారయ్యారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు అతని అనుచిత ప్రవర్తన నిరూపణ కావడంతో సస్పెండ్ చేశారు:

# 100 గ్రామాల పర్యటన

**- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**



**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పెదకూరపాడు నియోజకవర్గంలోని 100 గ్రామాలను పర్యటించే లక్ష్యంతో కార్యక్రమం చేపట్టారు. వంద రోజులు కార్యక్రమంగా దీన్ని రూపొందించినట్లు ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. ఈ విషయమై మంత్రి లోకేష్ ను కలిసి పర్యటన,దాని వివరాలపై సూచనలను సలహాలను తీసుకున్నారు. అనంతరం భాష్యం ప్రవీణ్ ను నారా లోకేష్ అభినందించారు.

# ఐటిసి సేవలు అమూల్యం

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** సమాజ హితం కోసం కృషి చేసే కార్పోరేట్ సంస్థల్లో ఐ టి సి సంస్థ ముందుంటుందని .. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా బాలికల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని పలువురు కొనియాడారు. శుక్రవారం అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐటి సి బంగారు భవిష్యత్తులో భాగంగా ఏడు లక్షల రూపాయల వ్యయంతో ఐదు టాయిలెట్లు మరియు వాటర్ బేసిన్లు నిర్మించడం కోసం జరిగిన భూమిపూజ కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు చావలి సరోజిని మాట్లాడుతూ ఐటిసి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. వ్యాపారం ఒక వృత్తి అయితే సమాజ హితం కూడా మా మార్గం, కర్తవ్యం అని ఐటిసి ప్రాజెక్టు అధికారి ఆదర్శరాజ్ అన్నారు. ఆడపిల్లల ఆరోగ్య సంరక్షణ ఆలోచనతోనే ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని ఫినిష్ సొసైటీ మేనేజర్ నారాయణ రావు తెలిపారు. కమిటీ దాతలు మరియు కార్పొరేట్ సంస్థల సహకారంతో పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు ఏర్పడుతున్నాయని కళాశాల ఇన్చార్జి రామచంద్ర రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు సంజీవ రెడ్డి, ఐటి సి ఇంజినీరు తిరుపతి నాయుడు , పిల్లి శైలజ, ఉపాధ్యాయులు హనుమంత రావు, చంద్రమౌళి, శ్రీనివాస రావు, శివ పార్వతి, ధర్మరాజు, నాగిరెడ్డి కమిటీ సభ్యులు గంగాధర రెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన



**పెదకూరపాడు మేజర్ న్యూస్:** మీ సౌకర్యమే మా ప్రాధాన్యం ప్రజల చేతిలో ప్రభుత్వం అనే నినాదంతో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రభుత్వ సేవల గురించి ప్రతిశుక్రవారం ఇంటింటి 75 తాళ్లూరులో ప్రచారం నిర్వహిస్తున్నట్లు వెల్ఫేర్ అసిస్టెంట్ పద్మ ,మహిళా పోలీస్ మున్నీ తెలిపారు.ప్రతి ఇంటికీ వెళ్ళి వాట్సప్ రిజిస్ట్రేషన్ ద్వారా పౌరసేవలు ఇంటివద్దనుండే పొందవచ్చని సవివరంగా అవగాన కల్పిస్తున్నట్లు తెలిపారు. వాట్సాప్ లో 95523 00009 నెంబర్ ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లో సేవ్ చేసుకొని ప్రభుత్వ సేవలను పొందాలని వారు తెలిపారు.

# నాయీబ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం: మంత్రి మనోహర్



**తెనాలి, మేజర్ న్యూస్:** తెనాలి రైల్వే స్టేషన్ రోడ్ లోని పలు సెలూన్ లను రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ సందర్శించి నాయి బ్రాహ్మణలతో ముచ్చటించారు. ఎన్నికలలో ఇచ్చి హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో సెలూన్ షాపులకు 150 నుంచి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించే విధంగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా నిరుపేద, మధ్య తరగతి నాయి బ్రాహ్మణులకు మేలు జరుగుతుందని హర్షాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తొలిసారిగా తెనాలిలో ఈ పథకం అమల్లోకి వస్తుందని చెప్పారు. తెనాలి మున్సిపల్ పరిధిలో 150 షాపులు, తెనాలి మండలంలో 31 షాపులు, కొల్లిపర మండలంలో 29 షాపులకు ఈ పథకం అమల్లోకి వచ్చింది. వచ్చే నెల నుండి ఈ షాపులవారు బిల్లు చెల్లించాల్సిన పనిలేదని తెలిపారు. 200 యూనిట్లకు పైబడి విద్యుత్ వినియోగిస్తే అప్పుడు మొత్తం బిల్లు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రి వెంట నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కురగంటి రఘు రామయ్య, విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణ, డిప్యూటీ డివిజనల్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్, పలువురు జనసేన నాయకులు ఉన్నారు.

# ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటాం

**-సాధ్యమైనంత త్వరగా వర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు**
**-విద్యాసంస్థల్లో రాజకీయ ప్రసంగాలు, జెండాలను అనుమతించం**
**-విద్యార్థి, యువజన సంఘాల నాయకుల సమావేశంలో మంత్రి నారా లోకేష్**



మంగళగిరి, మేజర్ న్యూస్: ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని,సాధ్యమైనంత త్వరగా వర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి కూడా తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టంచేశారు. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ తో విద్యార్థి, యువజన సంఘాల జెఎసి నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 11 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని విద్యార్థి, యువజన సంఘ నాయకులు మంత్రి లోకేష్ కు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విద్యార్థి సంఘ నాయకులకు ఆయా విద్యాసంస్థల పనివేళలు పూర్తయిన తర్వాత రాజకీయేతర సమస్యలపై చెప్పుకోవడానికి ప్రత్యేక వేదికపై అవకాశమిస్తామని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లిస్తామని, ఈ విషయంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై వత్తిడితెస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు సుమారు రూ.4,200 కోట్ల రూపాయలు పెండింగ్ లో పెట్టిందని, ఆ సొమ్మును కూడా ఆర్థిక వెసలుబాటు చూసుకొని దశలవారీగా చెల్లిస్తామని తెలిపారు. విద్యార్థి సంఘాలు కళాశాలల్లో నిర్వహించే యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ కు సహకరిస్తామని అన్నారు. అపార్ ఐడితో అనుసంధానం ద్వారా విద్యార్థుల బస్ పాస్ ల జారీకి సులభతరమైన విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు. రాష్ట్రంలోని కళాశాలలు, యూనివర్సిటీల్లో రాజకీయ ప్రసంగాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని స్పష్టంచేశారు. ఈసారి కళాశాలల్లో అడ్మిషన్లు ఆలస్యం కాకుండా తగుచర్యలు చేపడతామని అన్నారు. వచ్చే ఏడాది కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లకు సంబంధించిన షెడ్యూలును ఈ ఏడాదే ప్రకటిస్తామని, షెడ్యూలు ప్రకారమే సెట్ ల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివిధ యూనివర్సిటీల్లో మిగిలిన పోయిన సీట్లకు నేరుగా అడ్మిషన్లకు అవకాశం కల్పించాలని విద్యార్థి సంఘ నేతలు కోరగా, బేసిక్ ఎగ్జామినేషన్ పాస్ కావాల్సిందేనని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో 4,300 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, న్యాయపరమైన చిక్కులను అధిగమించి సాధ్యమైనంత త్వరగా వాటిని భర్తీచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థి యువజన సంఘాల జెఎసి మంత్రి లోకేష్ దృష్టికి తెచ్చిన సమస్యల వివరాలిలావున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలి. విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘ నాయకుల ప్రవేశాన్ని నిషేధిస్తూ విడుదల చేసిన ఉత్తర్వులను ఉపసంహరించాలి. డిగ్రీ ఆన్ లైన్ అడ్మిషన్లను రద్దుచేసి ఆఫ్ లైన్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. పేదవిద్యార్థులకు పిజి విద్యను దూరంచేసే జిఓ నెం. 77ని రద్దుచేయాలి. కామన్ పిజి సెట్ విధానాన్ని రద్దుచేసి ప్రతి యూనివర్సిటీకి ప్రత్యేకంగా ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించాలి. పిపిపి విధానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ఏర్పాటును నిర్మించే జిఓ నెం.107, 108లను రద్దుచేయాలి. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాల విద్యను కాపాడాలి. గత ప్రభుత్వం మూసివేసిన 2వేలకు పైగా పాఠశాలలను పునఃప్రారంభించాలి. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలి. ఇటీవల కాలంలో సంక్షేమ హాస్టళ్లలో సంభవిస్తున్న ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, కమాటీ, వాచ్ మెన్ పోస్టులను భర్తీచేయాలి. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలి. గత ప్రభుత్వం విద్యార్థి సంఘ నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఎపి విద్యార్థి యువజన సంఘాల జెఎసి నాయకులు విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో విఎంఆర్ డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, శాప్ చైర్మన్ రవినాయుడు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నాజర్ జీ, జి.వాలరాజు (ఎఐఎస్ఎఫ్), కె.ప్రసన్న, పి.రామ్మోహన్ (ఎస్ఎఫ్ఐ), భాస్కర్, వినోద్ (పిడిఎస్ యు), వి.శ్రీనివాసరావు (ఎన్ఎస్ యుఐ), ఎల్.భానుసూరి (పిడిఎస్ఓ), జి.రామన్న, వై.రాము (డివైఎఫ్ఐ), పి.రాజేంద్రబాబు, యుగంధర్ (ఎఐవైఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో

# డిసెంబర్ 13న మెగా జాబ్ మేళా

**-పోస్టర్ల ఆవిష్కరణ**

**మంగళగిరి, మేజర్ న్యూస్:** గుంటూరు హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆవరణలో డిసెంబర్ 13న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్ ను శుక్రవారం ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆటోనగర్ లోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువత ఉపాధిని పెంచేందుకు ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనను ప్రధాని మోదీ ప్రకటించి, యువతకు ప్రయోజనం చేకూర్చేలా భారీ ఉపాధి కల్పనకు మద్దతు ఇస్తున్నారని అన్నారు. రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మాత్యులు లోకేష్ వికసిత్ భారత్ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతకు వారి విద్యార్హతలకు తగ్గట్టుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 'కౌశలం' పేరుతో నిరుద్యోగులకు అండగా నిలిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. మంత్రి లోకేష్ సూచనల మేరకు పలు ప్రాంతాల్లో మెగా జాబ్ మేళా నిర్వహించి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధిని కల్పించడం జరిగిందని, ఇదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ముందుకు వచ్చి ఉభయ రాష్ట్రాల్లోని నిరుద్యోగ యువతకు 50 పైన కంపెనీల ద్వారా వెయ్యికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారన్నారు. కావున ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు, కోశాధికారి, ట్రెజరర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, సంఘ ప్రముఖులు, పాల్గొన్నారు.






## సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

**తెనాలి, మేజర్ న్యూస్ :** తెనాలిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న 22 మంది లబ్ధిదారులకు రూ.18,48,064 విలువైన చెక్కులను అందజేశారు. కూటమి ప్రభుత్వం నిరుపేద అనారోగ్య బాధితులకు అండగా నిలుస్తుందని మంత్రి మనోహర్ చెప్పారు. తెనాలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 326 మందికి రూ. 3.60 కోట్లను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించామన్నారు.

# అన్నదాతకు.. తుఫాన్ అలర్ట్..!

**- నేటి నుండి జిల్లాలో తుఫాన్ వచ్చే అవకాశం**
**- పంటలు కాపాడుకోవాలని కలెక్టర్ సూచన**
**- రైతుల్లో ఆందోళన**



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** ఇప్పటికే పొలం పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఈ నెల 22 నుంచి 27 వరకు కోస్తా జిల్లాలకు వర్షాలు వస్తాయనే హెచ్చరికలతో వారు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాను చేసిన నష్టాల నుంచి రైతులు కోలుకోకముందే మరో తుఫాను హెచ్చరిక కలవర పరుస్తోంది. ప్రస్తుతం శ్రీలంకలో ఏర్పడి తమిళనాడు వైపు వస్తున్న అల్పపీడనం వల్ల ఇప్పటికే రాయల సీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కోస్తాంధ్ర వైపు కూడా ఈ నెల 22 నుంచి మధ్య బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని, అది కోస్తా జిల్లాలకు విస్తరించనుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో వ్యవ సాయ శాఖ అధికారులను గుంటూరు జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేయడంతో పాటు రైతులను అప్రమత్తంగా ఉంచి రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులుగా మీదేనంటూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. ఇప్పుడిప్పుడే వరికోతలు మోదలు పెట్టారు. కొంతమంది రైతులు పొలాల్లోనే కుప్పలు పెడుతున్నారు. జిల్లాలోని 18 మండలాల్లోనూ సుమారు లక్షల ఎకరాల్లో రైతులు వరిపంట వేసినట్లు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. నేటి వరకు 40 శాతం వరి పంట కోసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కొంతమంది రైతులు పొలాల్లోనే పంటను కుప్పలు వేస్తున్నారు. మూడు రోజుల సమయం ఉన్నందున కోసిన పంటను సురక్షితంగా ఉంచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారుల పాటు జిల్లా కలెక్టర్ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. 'తుఫాను హెచ్చరిక ఉన్నందున ఈ నెల 22 నుంచి రైతులు కోతలు కోయవద్దు. కోసిన పంటను కుప్పలుగా వేయాలి. పచ్చిగా ఉంటే ఉప్పు ద్రావణం పిచికారీ చేసి కుప్పలు వేసుకోవాలని వ్యవసాయశాఖ సూచిస్తున్నారు.

## న్యాయ దేవత విగ్రహాన్నిఆవిష్కరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** జిల్లా కోర్ట్ ఎదుట శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి జిఎంసి ఏర్పాటు చేసిన న్యాయ దేవత విగ్రహాన్ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇతర జిల్లా జడ్జీలతో కలిసి ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా నగర సుందరీకరణ, పచ్చదనం పెంపుకు నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా ఈ సీజన్ లో 5 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. రోడ్ల సుందరీకరణలో జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద యోగాంధ్ర సందర్భంగా సూర్య నమస్కారాల ప్రతిమలు, ప్రస్తుతం జిల్లా కోర్ట్ దగ్గర న్యాయ దేవత విగ్రహాన్ని ఆవిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో మొదటి అడిషనల్ జిల్లా జడ్జి వివిఎల్ సత్యవతి, 3వ అడిషనల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జి సిహెచ్.వి.ఎన్.శ్రీనివాసరావు, 4వ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి ఆర్.శరత్ బాబు, ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్స్ జడ్జి షమీమ్ పర్వీన్ సుల్తానా బేగం, గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.శివ సూర్య నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, సీనియర్ సివిల్, జూనియర్ సివిల్ జడ్జీలు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ వర్సిటీని సందర్శించిన అమెరికా బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ బృందం



**నేటిదినపత్రిక సూర్య గుంటూరు జిల్లా బ్యూరో :** యూఎస్ఏ-ఓహియోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ (బీజీఎస్‌యూ) ప్రతినిధుల బృందం శుక్రవారం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించినట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ. నాగభూషణ్ తెలిపారు. బీజీఎస్‌యూ ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నే కే. రోజర్స్, అడ్వకేట్ డాక్టర్ సాంద్రా బీ. ఎర్లే, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి క్రోవి, అకడమిక్ అఫైర్స్ వైస్ ప్రొవోస్ట్ డాక్టర్ రోడ్నే కే. రోజర్స్, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ - ఇన్నోవేషన్ డీన్ డాక్టర్ వేల్ మోక్తర్ తదితరులకు వర్సిటీ తరఫున ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ విజ్ఞాన్స్-బీజీఎస్‌యూ మధ్య ఉన్న అవగాహన ఒప్పందం కేవలం విద్యార్థి మార్పిడికి మాత్రమే కాకుండా అంతర్జాతీయ విద్యా-పరిశోధనా సహకారం అని తెలిపారు. రెండు యూనివర్సిటీల అధ్యాపకులు ఒకరికొకరు వర్సిటీల్లో తాత్కాలికంగా బోధించే అవకాశం ఉంటుందన్నారు. బోధనా నాణ్యత పెరగడం, గ్లోబల్ టీచింగ్ ఎక్స్‌పోషర్, నూతన సిలబస్ రూపకల్పనకు సహకారం లభిస్తాయని తెలిపారు. విజ్ఞాన్స్ మరియు బీజీఎస్‌యూ పరిశోధకులు కలిసి అంతర్జాతీయ స్థాయి పరిశోధన పత్రాలు ప్రచురించేందుకు, పేటెంట్ల కోసం సంయుక్తంగా దరఖాస్తులు చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రెండు వర్సిటీల మధ్య సంయుక్త ఇన్నోవేషన్ సెంటర్లు, ల్యాబ్‌లు, శిక్షణా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విజ్ఞాన్స్ అధ్యాపకులకు బీజీఎస్‌యూలో సబాటికల్ రీసెర్చ్ అవకాశాలు, బీజీఎస్‌యూ విద్యార్థులు విజ్ఞాన్స్‌లో సెమిస్టర్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్, విజ్ఞాన్స్ విద్యార్థులు అమెరికాలో సమ్మర్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్‌లు, స్టార్టప్ ఐడియాలను బీజీఎస్‌యూ ల్యాబ్‌లలో టెస్ట్ చేసుకునే ప్రత్యేక సౌకర్యం, రెండు వర్సిటీల మధ్య ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూర్షిప్, బిజినెస్ ఇంక్యుబేషన్ లో సంయుక్తంగా ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తామన్నారు. విమానయాన రంగానికి గ్లోబల్ ప్రమాణాలతో కూడిన మేనేజ్మెంట్ కోర్సులను సంయుక్తంగా రూపొందిస్తామని చెప్పారు. డ్రోన్ మాన్యుఫాక్చరింగ్, వ్యవసాయం-సర్వేయింగ్, డిఫెన్స్ అప్లికేషన్లపై రీసెర్చ్ ల్యాబ్‌లను కలిసి అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. స్మార్ట్ సిటీస్, స్మార్ట్ అగ్రి, స్మార్ట్ ఇండస్ట్రీస్‌కు అవసరమైన ఐవోటీ ఆధారిత ప్రాజెక్ట్‌లు రూపొందించనున్నట్టు తెలిపారు. చిప్ డిజైన్, సెమికండక్టర్ టెక్నాలజీల్లో సంయుక్త పరిశోధనలు నిర్వహించి విద్యార్థులకు హ్యాండ్స్-ఆన్ ట్రైనింగ్ అందించనున్నట్టు చెప్పారు. వ్యవసాయ రంగంలో డ్రోన్లు, ఐవోటీ సెన్సర్లు, స్మార్ట్ ఇరిగేషన్ వంటి టెక్నాలజీల అభివృద్ధిపై రెండు వర్సిటీలు కలిసి పనిచేయనున్నట్టు వివరించారు.

**బీజీఎస్‌యూ ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నే కే. రొజర్స్ మాట్లాడుతూ..**

"విజ్ఞాన్స్ యూనివర్సిటీతో మా భాగస్వామ్యం కేవలం విద్యా మార్పిడికే పరిమితం కాదు. రాబోయే టెక్నాలజీ ప్రపంచానికి భారత-అమెరికా విద్యార్థులను సిద్ధం చేసే సమగ్ర అకడమిక్ మిషన్ ఇది." అని అన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ. నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, డీన్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలను విక్రయించినా, సరఫరా చేసిన చట్టరీత్యా నేరం



**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :** మాదక ద్రవ్యాలను వినియోగించడం, విక్రయించడం, సరఫరా చేయడం చట్టరీత్యా నేరం అటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్ డీఎస్పీ జి భానోదయ హెచ్చరించారు. శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంట సమయంలో నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డి పాలెం గ్రామము, వై - జంక్షన్ సమీపంలో ఎండీఎంఏ అనే మత్తు పదార్థాన్ని సరఫరా చేస్తున్నారని ఈగల్ టీం ద్వారా నల్లపాడు సీఐ వంశీధర్ కి రాబడిన సమాచారం మేరకు ఎస్సై మహేష్ కుమార్ సిబ్బందిని సదరు ప్రదేశంలో నిఘా పెట్టి, డ్రగ్ సరఫరా చేస్తున్న వ్యక్తులను పట్టుకోమని ఇచ్చిన ఆదేశాల మేరకు, వారు నిఘా పెట్టి డ్రగ్ సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బెంగళూరు రాష్ట్రానికి చెందిన విశాల్ సింగ్ చౌహాన్ S/o నానుసింగ్ చౌహాన్, గుంటూరుకు చెందిన బత్తుల శ్రీనివాస్ లుగా తేలింది అన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీవకుల్ జిందల్ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలన కొరకు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని, గంజాయి, ఎవరైనా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, సరఫరా వంటి కార్యకలాపాల్లో పాల్గొంటే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి జి బానోదయ హెచ్చరించారు.

**- సౌత్ డిఎస్పి జి.భానోదయ**

# చెరువుకు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు

## - కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** నగరపాలక సంస్థ పరిధిలోని శిల్పారామం పక్కనే ఉన్న చెరువుకి కాంపౌండ్ వాల్ నిర్మాణంకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ శిల్పారామం, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ శిల్పారామం పక్కనే ఉన్న చెరువుకి కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్నాయని, వెంటనే పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్వర్ణభారతి నగర్ నుండి అవుట్ ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులపై కూడా అంచనాలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం పట్టాభిపురంలో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, ప్రతి నిర్మాణం నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ మేరకే నిర్మాణం చేయాలన్నారు. పట్టణ ప్రణాళిక కార్యదర్శులు నిర్మాణపనులను పర్యవేక్షణ చేయాలని, నిబందనల మేరకు నిర్మాణం చేయకుంటే వెంటనే పనులు నిలిపివేయాలని ఆదేశించారు. పర్యటనలో ఏపి శిల్పారామం చైర్పర్సన్ చేరేడ్డి మంజులా రెడ్డి, కార్పొరేటర్ బి.స్మితపద్మజ, డిఈఈ రమేష్ బాబు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వస్తువుల కలపనలో అధికారుల పనితీరు అభినందనీయం




**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** అన్నక్యాంటీన్ల వద్ద మౌలిక వసతుల కల్పనలో జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ప్రస్తుత వారి పనితీరు అభినందనీయమని సంతోషం వ్యక్తుల గురించి చేశారు. శుక్రవారం ఆర్టీఓ ఆఫీస్ దగ్గరలోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్లలో ఆహారం తీసుకునేవారికి ఏ ఇబ్బంది లేకుండా లైటింగ్, ఫ్యాన్ల ఏర్పాటు, ఎక్కడైనా మరమత్తులు ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. పరిసరాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధ్యాన్యత ఇవ్వాలన్నారు. ఈగలు, ఇతర క్రిమి కీటకాలు రాకుండా డిస్ ఇన్ఫెక్షన్ చర్యలను మలేరియా సిబ్బంది చేపట్టాలన్నారు. అలాగే ఆహార సరఫరా అనంతరం ప్రాంగణం శుభ్రం చేయాలని అక్షయపాత్ర సిబ్బందిని ఆదేశించారు. ప్రతి రోజు ప్రభుత్వ నిర్దేశిత సమయంలో ఆహారం అందుబాటులో ఉండేలా, సమయ పట్టిక కనిపించేలా బోర్డ్ లను ఏర్పాటు చేయాలన్నారు.

# చలో కలెక్టరేట్ కు అనుమతి కోరిన సిఆర్పిలు



**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** మండలంలో విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది వారి హక్కుల సాధనకై నవంబర్ 24, డిసెంబర్ 10 తేదీన చలో కలెక్టర్ కార్యాలయం చేపట్టామని ఎంఈఓ ఏ కుల ప్రసాదరావు కు వినతి అందించారు. రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో పాల్గొనుటకు సామూహిక సెలవు కొరకు పెదకూరపాడు మండల విద్యాశాఖ అధికారులకు నోటీసులు అందించమని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు శివా జయప్రకాష్ తెలిపారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ళ జైలుశిక్ష

**తెనాలి, మేజర్ న్యూస్ :** బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఆరేళ్ల బాలిక 2021 జనవరి 1వ తేదీన బహిర్భూమికి ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలోకి వెళ్లింది. అదే ప్రాంతానికి చెందిన బిళ్లా డేవిడ్‌రాజు బాలిక వద్దకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లిన బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. కేసును అప్పటి డీఎస్పీ కె. స్రవంతిరాయ్, నర్సరావుపేట దిశా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ యు. రవిచంద్ర దర్యాప్తు చేశారు. కేసు శనివారం విచారణకు రావడంతో సాక్షాధారాలను పరిశీలించిన తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి, నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో అరు నెలల జైలు విక్ష అనుభవించాలన్నారు. అలానే బాధిత బాలిక కుటుంబానికి రూ. 4 లక్షల ప్రభుత్వ సాయం నెల రోజుల్లోగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిరక్ ప్రాసిక్యూటర్ వెలినేని రాఘవయ్య వాదనలు వినిపించారు.

# రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



**తెనాలి మేజర్ న్యూస్ :** రైల్లో నుండి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మతి చెందాడు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుగ్గిరాల - పెదవడ్లపూడి స్టేషన్ల మధ్య పట్టాల వెంబడి మతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని శనివారం పరిశీలించారు. సుమారు 50 నుండి 60 ఏళ్ల మధ్య వయున్న వ్యక్తి మతి చెంది పట్టాల వెంబడి పడి ఉన్నాడు. మతుడు నల్ల చొక్కా, కాషాయ రంగు పై పంచె, లుంగీ ధరించి ఉన్నాడు. మతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. ఇన్‌చార్జి ఎస్ఐ రమేష్‌బాబు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలన్నారు.

# రోడ్డు పై క్షుద్ర పూజల చేసిన ఘటన కలకలం రేపింది



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** అమావాస్య రాత్రి.. రోడ్డు పై క్షుద్రపూజలు చేసిన ఘటన బ్రాహ్మణపల్లి లో కలకలం రేపింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి లో వెళ్లే ప్రధాన రహదారి పై ఈ రోజు ఉదయం క్షుద్రపూజలు చేసిన ఘటన అటువైపు నుంచి వెళ్లుతున్న వాహనదారులు, వాకర్స్, స్థానిక ప్రజలను కలకలం రేపాయి. రోడ్డు మీద గుమ్మడి కాయలు, నిమ్మకాయలు, కుంకుమ, భారీగా క్షుద్ర పూజల సామాగ్రి దర్శనమిచ్చాయి. దీంతో ఒక్కసారిగా స్థానిక గ్రామ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గురువారం అమావాస్య కావడంతో గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు వద్ద అర్ధరాత్రి సమయంలో ఇలాంటి పనికి ఒడిగట్టి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. నేటి సాంకేతిక యుగంలో కూడా ఇలాంటి మూడనమ్మకాలను కొందరు పాటించడాన్ని ఆశ్చర్యానికి గురిచేయడంతో పాటు ఇంకా పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో కూడా కొందరు మూఢనమ్మకాలను పాటిస్తున్నారని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

# లీకేజీ పనులను ముందుగానే పూర్తి చేసిన ఇంజనీరింగ్ అధికారులు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** జిఎంసి హెడ్ వాటర్ వర్క్స్ లో చేపట్టిన పైప్ లైన్ లీకు మరమత్తు పనులు నిర్దేశిత గడువుకి ముందే పూర్తి చేసిన ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ పులి శ్రీనివాసు లు తోపాటు ప్రజలు అభినందిస్తున్నారు. లీకు మరమత్తు పనులను వేగంగా చేపట్టాలన్న కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా కృషి చేసిన ఇంజినీరింగ్ అధికారులు సకాలంలో పూర్తి చేశారు. గడువుకి ముందే పనులు పూర్తి కావడంతో శుక్రవారం ఉదయం నుండి సరఫరా పునరుద్దరణ ను అధికారులు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం పాక్షికంగా, శనివారం ఉదయం నుండి యధావిదిగా నగరంలో జరగనున్న త్రాగునీటి సరఫరాను ప్రజల వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

# వర్కర్స్ గ్రీవెన్స్ లో ఫిర్యాదులు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** నగర పాలక సంస్థలో విధులు నిర్వహించే కార్మికులు మరియు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై నేరుగా తమకు అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కొరకు వర్కర్స్ గ్రీవెన్స్ ని కమిషనర్ ఛాంబర్ లో అదనపు కమిషనర్ నిర్వహించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ విభాగాల వారీగా కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంకు ప్రతి నెల వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహిస్తామని, గ్రీవెన్స్ లో అందే అర్జీలను, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విభాగాదిపతులకు స్పష్టం చేశారు. కార్మికులు కూడా తమకు అందే జీతాలు, ఇతర అలవెన్స్ ల సమస్యలపై గ్రీవెన్స్ లో నేరుగా తమ దృష్టికి తేవాలన్నారు. గ్రీవెన్స్ లో యూనియన్ నాయకులు మధుబాబు జిఎంసి అప్కాస్ కార్మికులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు యాక్సిస్ బ్యాంక్ అకౌంట్ల ఓపెనింగ్ ప్రక్రియ వేగంగా చేసి, ఈ నెల జీతాలు సదరు అకౌంట్లలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, మరో యూనియన్ నాయకులు మాల్యాద్రి చనిపోయిన ఆప్కాస్ కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని, గ్రీవెన్స్ సమయం మధ్యాహ్నం కాకుండా ఉదయం 11 గంటలకు నిర్వహించాలని, వర్కర్స్ గ్రీవెన్స్ ని ఆన్ లైన్ చేసి, పరిష్కార స్తితిని తెలియచేయాలని, మరో యూనియన్ నాయకులూ ముత్యాలరావు ఇంజినీరింగ్ కార్మికుల విద్యార్హతను బట్టి స్కిల్, సెమీ స్కిల్ జీతాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా, విభాగ సూపరిండెంట్లు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**– ఎస్సై పి.అనిల్ కుమార్**



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** విద్యార్థి దశ నుంచే మహిళల రక్షణ, బాల్య వివాహాల నిర్మూల న, ఫోక్సో తదితర చట్టాలపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని ముప్పాళ్ళ మండల ఎస్సై పి అనిల్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మాదల లో మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే గురుకుల బాలిక ల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సౌకర్యవంతమైన, సురక్షితమైన, ప్రేమతో కూడిన స్పర్శ ( గుడ్ టచ్), వేధింపులు, ఆందోళన, ఇబ్బందికరమైన (బ్యాడ్ టచ్) స్పర్శల గురించి ఆయన విద్యార్థుల అవగాహన కలిగించారు. వీటిపట్ల స్పష్టత కలిగి ఉండాలన్నారు. మీ బంగారు భవిష్యత్తు కోసం మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారన్నారు. వారివిఆశయాన్ని నిర్లక్ష్యం చేయకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆయన సూచించారు. మీ పట్ల ఎప్పుడైనా, ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారి సమాచారాన్ని పోలీసులకు అందజేస్తే మీ పేర్లను గోప్యంగా ఉంచి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పరిశీలన



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పరిధిలోని లింగంగుంట్ల పంచాయతీ, పట్టణంలో ఉన్న ఎస్ఆర్కేటీ కాలనీలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి నిర్మాణం పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సంబంధిత శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానికంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నేతలు ఉన్నారు.

# కాపు జేఏసీ ఆధ్వర్యంలో 23న జరిగే వన సమారాధనకు తరలి రావాలి

**– కాపు జేఏసీ నేతల పిలుపు**





### కాపుల వన సమారాధన ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** కాపు జేఏసీ, కాపు జాగృతి ఆధ్వర్యంలో వడ్డేశ్వరం పరిధి గుంటూరు కాలువ గట్టు రోడ్డు బాంబుల నాయుడు తోట లో ఈ నెల 23 వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగే కాపు వారి కార్తీక మాస వన భోజన మహోత్సవానికి నియోజకవర్గ, రాష్ట్ర వ్యాప్తంగా కాపులంతా తరలి రావాలని కాపు జేఏసీ నేతలు పిలుపు నిచ్చారు. మంగళగిరిలోని ప్రెస్ క్లబ్ లో కాపు జేఏసీ, కాపు జాగృతి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నా రాజేష్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా కాపులంతా ఐక్యంగా ఈ నెల 23 న వడ్డేశ్వరంలో జరిగే వన భోజన మహోత్సవానికి తరలి రావాలని పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తను అయిన తన శ్రమను గుర్తించి ఐటి, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని కేటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ శంకరశెట్టి పిచ్చయ్య మాట్లాడుతూ, తాను టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నానని తెలిపారు. పార్టీలో కష్టపడి పని చేస్తే పదవులు వాటంతట అవే వరిస్తాయని స్పష్టం చేశారు. కాపు జేఏసీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్న రాజేష్ మాట్లాడుతూ, కాపు జేఏసీ కాపు జాగృతి అధ్యక్షులు చందు జనార్ధన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 వ తేదీన వడ్డేశ్వరంలో జరిగే కాపుల వన సమారాధన కార్యక్రమానికి నియోజకవర్గ, రాష్ట్రం నలు మూలల నుంచి కాపు సోదరులందరూ, తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా మంగళగిరి నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గా విన్నకోట శ్రీనివాసరావు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్గా శంకరశెట్టి పిచ్చయ్య, మంగళగిరి శివాలయం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ గా తిరుమల శెట్టి మురళి లకు అవకాశం కల్పించడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. జనసేన పార్టీ మంగళగిరి యువజన విభాగం నాయకులు చిట్టెం అవినాష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కాపుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని కొనియాడారు. కాపు జేఏసీ నాయకులు తోట సాంబశివరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కాపుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. కాపుల్లో మరింత ఐక్యతను పెంపొందించేందుకు వన సమారాధన వంటి కార్యక్రమాలను దోహద పడతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన విన్నకోట శ్రీనివాసరావును సమావేశంలో కాపు జేఏసీ నాయకులు శాలువా, పూల మాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సమావేశానికి హాజరైన నాయకులందరినీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు ఎర్రంశెట్టి రాము, చందు భావన్నారావణ తదితరులు పాల్గొన్నారు.

## రాజుపాలెం నూతన ఎస్ ఐ గా చార్జ్ తీసుకున్న సి హెచ్ మణి కృష్ణ



**రాజుపాలెం మేజర్ న్యూస్ :** మండల హెడ్ క్వార్టర్ రాజుపాలెం పోలీస్ స్టేషన్ కి నూతన ఎస్సైగా సిహెచ్ మని కృష్ణ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో రొంపిచర్ల చేస్తూ ఇక్కడికి రావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాన్ని ఎవరు ఉలిందించిన కఠిన చర్యలు తప్పవని, ఫ్యాక్షన్ గ్రామాల్లో నిఘా ఎక్కువ ఉంటుందని, నైట్ బీట్ ఎక్కువగా ఉంటుందని, ఎవరు కూడా అర్ధరాత్రి రీజన్ లేకుండా తిరిగితే చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలిపారు, అదేవిధంగా మహిళలకు ఏ సమస్య వచ్చినా స్టేషన్ కి వచ్చి కంప్లైంట్ ఇవ్వాలని మణి కృష్ణ తెలిపారు.

## జర్నలిస్టులకు హెల్త్ కార్డుల పంపిణీ

**హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు రాయితీలు కల్పించే హెల్త్ కార్డుల పంపిణీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా లు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ "జర్నలిస్టులు నిజమైన ప్రజాసేవకులు. వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సమస్యల్లో అండగా నిలిచేందుకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ, పరీక్షలు, మందులపై రాయితీలు కల్పిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రశంసనీయం" అని కొన్నారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కూటమి నాయకులు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు, స్థానిక ఐఎంఏ డాక్టర్లు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా పారేపల్లి మహేష్



**మంగళగిరి మేజర్ న్యూస్ :** గుంటూరు జిల్లా నూతన స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా మంగళగిరి నగరానికి చెందిన పారేపల్లి మహేష్ను రాష్ట్ర స్వర్ణకార సంఘం నియమించింది. ప్రధాన కార్యదర్శిగా షేక్ హీదాయితుల్లా, కోశాధికారిగా వేములూరి వెంకట సాయి కృష్ణలకు బాధ్యతలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ గతంలో కూడా జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన మహేష్కు మరోసారి అవకాశం ఇవ్వడం రాష్ట్ర సంఘం తీసుకున్న సానుకూల నిర్ణయమన్నారు. స్వర్ణకారుల అభ్యున్నతికి కొత్త కమిటీ అండదండలుగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చొరవతో స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర సంఘం తరపున ఆయన అభినందనలు తెలిపారు. కార్పొరేషన్కు పాలకవర్గం ఏర్పాటు చేసి, నిధులు కేటాయింపుపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకార సంఘాలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు.

## ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం

**– 2026-27 బడ్జెట్ అంచనాలకు ఆమోదం**



సమావేశం లో మాట్లాడుతున్న ఎంపీపీ జాన్

**దాచేపల్లి మేజర్ న్యూస్ :** ఎంపీపీ కందుల జాన్ అధ్యక్షతన పల్నాడు జిల్లా దాచేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఎంపిడివో కార్యాలయం లోని మీటింగ్ హాలులో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమైంది. సమావేశం ప్రారం భం కాగానే ఎంపిడిఓ వెంకటేశ్వర రావు సమావేశం ఎజెండా ను సభ లో సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ కందుల జాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల పరిషత్ బడ్జెట్ అంచనా రూ. 12.30 కోట్ల ను సభ లో ఆమోదించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ తమ శాఖల లో జరుగుతున్న పురోగతిని సభ లో చదివి వినిపించారు. సర్వ సభ్య సమావేశం లో జెడ్పీటీసీ మూలగొండ్ల వెంకాయమ్మ, వైస్ ఎంపీపీ షేక్ తండా అబ్దుల్ సత్తార్, ఎంఈవో పినాకపాణి, పంచాయతీ రాజ్ ఎఇ వెంకటేశ్వర నాయక్, ఎఓ వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యుఎస్ ఎఇ సోమయ్య, అటవీశాఖ అధికారి, పిహెచ్ సి వైద్యాధికారి సుచరిత పలువురు ఎంపీటీసీ, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై టీచర్లకు బోధనేతర బాధ్యతలు ఉండవు

◆ లెర్నింగ్ అవుట్ కమ్స్ పైనే పూర్తిగా దృష్టిపెట్టండి ◆ ఉపాధ్యాయ సంఘ నేతలతో మంత్రి నారా లోకేష్

**మంగళగిరి మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించి పరిష్కరిస్తున్నాం, ప్రభుత్వ ఉపాధ్యాయులంతా లెర్నింగ్ అవుట్ కమ్స్ పై శ్రద్ధపెట్టాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ తో ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, మాజీ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారు మంత్రి లోకేష్ దృష్టికి తెచ్చారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ... గత 17నెలల్లో 423 సమస్యలను ఫ్యాప్టో ద్వారా నా దృష్టికి తెచ్చారు, ఇందులో 200 సమస్యలు పరిష్కరించాం. 81 సమస్యలు పరిష్కార యోగ్యమైనవి కావు. 72 విజ్ఞాపనలు పాలసీ మేటర్స్ కు సంబంధించినవి, 71 సమస్యలు కోర్టుల పరిధిలో ఉన్నాయని చెప్పారు. వచ్చేనెలలో మెగా పిటిఎం మినహా ఈ విద్యాసంవత్సరంలో మరే ఇతర విద్యేతర పనులు ఉపాధ్యాయులకు ఉండవని స్పష్టంచేశారు. డిఇఓ, ఎంఇఓలు కేవలం లెర్నింగ్ అవుట్ కమ్స్ పైనే దృష్టిపెట్టాలని, వారికి సర్వీసు రూల్స్ బాధ్యతలు అప్పగించబోమని స్పష్టంచేశారు. కడప మోడల్ స్మార్ట్ కిచెన్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎపిటిఎఫ్ నాయకులు మంత్రి దృష్టికి తెచ్చారు. టెట్ నుంచి 2011కి ముందు ఉద్యోగంలో చేరిన ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి. ఇన్ సర్వీసు టీచర్లకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించి, కటాఫ్ మార్కులను 45శాతానికి తగ్గించాలి. 2003కి ముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి. కేంద్రప్రభుత్వం జారీచేసిన మెమో 57ని అమలుచేయాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుమీడియంను సమాంతర మాధ్యమంగా కొనసాగించాలి. మండలానికి ఒక తెలుగుమీడియం స్కూలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం అమలుచేస్తున్న 9రకాల స్కూళ్ల విధానాన్ని సమీక్షించి, 1 నుంచి 5 తరగతులను ఉన్నత పాఠశాలలనుంచి విడదీయాలి. ఉమ్మడి సర్వీసు రూల్స్ పై ప్రత్యేకంగా దృష్టిపెట్టి, దశాబ్ధాలుగా కొనసాగుతున్న ఈ సమస్యను పరిష్కరించాలి.



స్కూలు అసిస్టెంట్లను ఎంఇఓలుగా నియమించే విధానానికి స్వస్తిపలకాలి. ఎంఇఓలుగా ప్రధానోపాధ్యాయులనే నియమించాలి, జిల్లాపరిషత్ యాజమాన్యాల్లోని గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులను కూడా నియమించాలి. క్లస్టర్లలో ఖాళీగా ఉన్న టీచర్లను అధికసంఖ్యలో విద్యార్థులు గల పాఠశాలల్లో నియమించాలి. ఐటిడిఎలలో పండిట్ పోస్టులను అప్ గ్రేడ్ చేయాలి. కెజిబివిల్లో టీచర్లకు టైమ్ స్కేల్ ఇవ్వాలి. మోడల్ స్కూలు ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ రూపొందించి, గవర్నమెంట్, జిల్లాపరిషత్ వారితో సమానంగా విధివిధానాలు అమలుచేయాలి. పరీక్షలు దగ్గర పడుతున్నందున 2025లో బదిలీల్లో ఖాళీ అయిన సబ్జెక్ట్ టీచర్ పోస్టుల స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. ప్రతి మూడునెలలకోసారి ఉపాధ్యాయుల సమస్యలపై సంఘాలతో సమావేశం ఏర్పాటుచేయాలి. అసెస్ మెంట్ పుస్తకాలకు సంబంధించి మార్కులను అప్ లోడ్ చేయడం భారంగా మారింది. దీనిని పునఃసమీక్షించాలి. ఉపాధ్యాయులను బోధనేతర పనులనుంచి మినహాయించాలి. యాప్ ల అప్ లోడ్ భారాన్ని తగ్గించాలి. ప్లస్ 2 పాఠశాలల్లో జూనియర్ లెక్చరర్, పిఇటి పోస్టులను భర్తీచేయాలి. 78 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఎపిటిఎఫ్ కు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో సభ్యత్వం కల్పించాలని కోరారు. ఎపిటిఎఫ్ నేతల విజ్ఞాపనలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్

## - ఎస్సై పి.అనిల్ కుమార్



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** మండలంలోని మాదల గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 18 వందల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

# పంచగవ్య తయారీ కేంద్రం సందర్శన



**మంగళగిరి మేజర్ న్యూస్ :** రాజధాని పరిధి పెనుమాక గ్రామం లో సురేంద్ర రెడ్డి నిర్వహిస్తున్న పంచగవ్య తయారీ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ వైస్-ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు నాగేశ్వరరాజు, శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయంకు ప్రోత్సాహం అందిస్తుంది అని చెప్పారు. సేంద్రియ ఎరువుల వాడకం రైతుకు లాభదాయకం, ప్రజలకు క్షేమదాయకం అని చెప్పారు. రసాయన ఎరువుల వాడకం వలన ఆహారపంటలు కూడ కలుషితం అయ్యి ప్రజల ఆరోగ్యం కూడ పాడవుతుంది అని వెల్లడించారు. పంచగవ్య వాడకం వలన ఆహారపంటలు కూడ కలుషితం కాకుండా ప్రకృతి సహజసిద్ధం గా లభ్యమవుతాయి అని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కూడ బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కల్లం రాజశేఖర్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు శివ సాంబిరెడ్డి, పెనుమాకసొసైటీ అధ్యక్షులు కల్లం శివ గోవింద రెడ్డి, బొబ్బ రవితేజ, కల్లం శంతన్ రెడ్డి, వెలగపూడి కిషోర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణ పై దృష్టి సారించాలి



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. రహదారి భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్తవ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్నంలోనూ జిల్లాలోనూ వివిధ ప్రాంతాల్లో ప్రమాదాలు నివారణ పై ప్రత్యేక దృష్టి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, రవాణా శాఖ ఉప కమిషనర్ సీతారామరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి



**విజయవాడ మేజర్ న్యూస్ :** విద్యార్థుల్లో చెస్ ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు అవసరం... మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఇకోరెన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ బిలో 1800 ఫైడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-2025 కు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ నెల 22 నుంచి 24 వరకు విజయవాడలోని మారిస్ స్టెల్లా కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో చెస్ టోర్నమెంట్ జరుగనుంది. విద్యార్థుల్లో చెస్ ప్రతిభను వెలికితీయడం, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పోటీ చేసే అవకాశాలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమని మంత్రి మండిపల్లి అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పాల్గొనే యువ క్రీడాకారులకు తమ పూర్తి సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్, మారిస్ స్టెల్లా కాలేజ్ సంయుక్తంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నాయి.

# 27న మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం

**మాచవరం మేజర్ న్యూస్ :** మాచవరం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈనెల 27న ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విష్ణు చిరంజీవి తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు తమ శాఖలకు సంబంధించి రికార్డులు తీసుకొని హాజరుకావాలని ఆయన అన్నారు. ఈ సమావేశానికి జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

# పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా 100 కేజీల భారీ కేక్ కట్ చేసిన మంత్రి కందుల దుర్గేష్

## తనకు దక్కిన అదృష్టంపై సంతోషం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేష్



**పుట్టపర్తి మేజర్ న్యూస్ :** సామాజిక సేవకు, మానవ సంక్షేమానికి ఆధ్యాత్మికతను సాధనంగా మలిచిన మహనీయుడు శ్రీ సత్య సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ కాంక్షించారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం పుట్టపర్తి శ్రీ భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం సాయంత్రం ప్రశాంతి నిలయంలో దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తుల సమక్షంలో 100 కేజీల భారీ కేక్ ను కట్ చేశారు. ఉదయం నుండి భక్తుల ఏర్పాట్ల పర్యవేక్షణలో నిమగ్నమైన మంత్రి కందుల దుర్గేష్ సాయంత్రం పుట్టపర్తి పట్టణంలోని చిత్రావతి నది ఒడ్డున ఉన్న శ్రీ సత్యసాయి పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి, టిడిపి సీనియర్ నాయకులు పల్లె రఘునాథ్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి బాబా జీవిత సందేశాన్ని ప్రతిబింబించేలా ప్రదర్శించిన లేజర్ షోను వీక్షించారు. జారీ చేసిన వారు: పిఆర్ఓ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రాఫీ మంత్రివర్యులు.



ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం. 63011 07116